నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, ఆదివారం 22 జూన్ 2025 | KAMAREDDY




ఆందోళన విరమించాలని రైతులు, గ్రామస్తులకు నచ్చచెప్పుతున్న ఎస్సై అనిల్‌రెడ్డి



## కరెంట్ కోతలను నిరసిస్తూ
# సబ్ స్టేషన్ ముట్టడి

మోర్తాడ్, జూన్ 21:విద్యుత్ సరఫరాలో సమస్యలను నిరసిస్తూ రైతులు, గ్రామస్తులు శనివారం సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో మూడు నెలలుగా విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం కలుగుతున్నది. దీనిపై అధికారులెవరికీ చెప్పినా పట్టించుకోవడం లేదు. వర్షాల్లేక పంటలు ఎండుముఖం పడుతుండడం, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తరుణంలో కమ్మర్‌పల్లి వీడీసీ ఆధ్వర్యంలో రైతులు, గ్రామస్తులు ఏకమై సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. కరెంట్ సరఫరా ఎందుకు ఆపేస్తున్నారు.. రోజుకు 30-40 సార్లు విద్యుత్ తీసేస్తుంటే ఎలా? అని ఏఈ అనయ, లైన్‌మెన్ అఫ్సర్‌ను నిలదీశారు. వర్షాలు లేక పంటలు ఎండుతున్నాయని రైతుల దీనస్థితి మీకు పట్టదా? అని ప్రశ్నించారు. డీఈ వచ్చే వరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. అక్కడకు చేరుకున్న ఎస్సైఅనిల్‌రెడ్డి డీఈ నిజామాబాద్‌లో ఉన్నారని, సమస్య పరిష్కారానికి కొంత సమయాన్ని ఇవ్వాలని సముదాయించారు. వచ్చే బుధవారం వరకు సమస్య పరిష్కరిస్తామని విద్యుత్ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

# కౌశిక్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

- కాంగ్రెస్‌ది నియంత పాలన
- అరెస్టులో చేయడంలో ఉన్న శ్రద్ధ.. హామీలు అమలు చేయడంలో లేదు
- మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



మోర్తాడ్, జూన్ 21: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజాపాలన కాదని, రాచరిక, నియంత, ఎమర్జెన్సీ పాలన అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్ని కేసులు పెట్టినా, అరెస్టులు చేసినా భయపడేది లేదని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని పేర్కొన్నారు. ప్రజల పక్షాన ఉంటూ, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే..ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పాలకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఉన్న శ్రద్ధ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో లేదని మండిపడ్డారు. అక్రమ కేసులు, అరెస్టులతో బీఆర్‌ఎస్ నేతల స్థైర్యాన్ని దెబ్బ తీయలేరని, భయపెట్టలేరని స్పష్టం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా.. ధైర్యంగా ఎదుర్కొంటామని, న్యాయస్థానాలపై పూర్తి నమ్మకం ఉన్నదని, అక్కడే కొట్లాడుతామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# రైతు భూమిలో తెల్లజెండాలు


- రుణం తిరిగి చెల్లిండం లేదని వేలానికి యత్నం
- చెల్లింపునకు రైతు అంగీకరించడంతో వేలం రద్దు




రైతు భూమిని వేలం వేయడానికి పొలంలో తెల్ల జెండాలు ఏర్పాటు చేసిన సొసైటీ అధికారులు

లింగంపేట, జూన్ 21: పాడిపరిశ్రమ కోసం తీసుకున్న రుణం చెల్లించక పోవడంతో సదరు రైతు భూమిని వేలం వేసేందుకు సహకార బ్యాంకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు పొలంలో తెల్ల జెండాలు పాతి, గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అయితే, రైతు రుణం తిరిగి చెల్లించడానికి అంగీకరించడంతో వేలంపాటను రద్దు చేశారు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం నల్లమడుగు గ్రామంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు సంగారెడ్డిపేట శ్రీనివాస్ పాడి పరిశ్రమ ఏర్పాటు కోసం 2016లో స్థానిక సొసైటీలో రూ.4.32 లక్షల రుణం తీసుకున్నాడు. అయితే, అనారోగ్యంతో పాటు ఆర్థిక పరిస్థితులు సహకరించక పోవడంతో రుణం తిరిగి చెలించలేదు. దీంతో తీసుకున్న రుణం వడ్డీతో సహా రూ.9.26 లక్షలకు చేరింది. డబ్బు చెల్లించట్లేదని సొసైటీ అధికారులు సదరు రైతు భూమిని వేలం వేయాలని నిర్ణయించారు. ఈ మేరకు పొలంలో జెండాలు పాతడంతో పాటు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో రైతు శ్రీనివాస్.. బ్యాంక్ అధికారులను శనివారం సంప్రదించి రుణం తిరిగి చెల్లించడానికి గడువు ఇవ్వాలని కోరారు. ఈ నెలాఖరు వరకు చెల్లిస్తే బకాయిలో రూ.2.40 లక్షల మాఫీ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఇద్దరి మధ్య అవగాహన కుదరడంతో భూమి వేలం ప్రక్రియను రద్దు చేసినట్లు సహకార సంఘం బ్యాంకు మేనేజర్ కుమారస్వామి తెలిపారు.

## ఘనంగా యోగా డే



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉమ్మడి నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. నిత్య జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని పలువురు యోగా గురువులు, ప్రముఖులు సూచించారు. యోగాతో మానసిక ప్రశాంతత, సంపూర్ణం ఆరోగ్యం సాధ్యమని పేర్కొన్నారు.



# నిద్రా ఎప్పుడు..?

నగర శివారులో భారీగా ఆక్రమణలు

- ఆనవాళ్లు కోల్పోయిన నగర పరిధిలోని చెరువులు
- కబ్జారాయుళ్లలో ఎక్కువ మంది అధికార పార్టీ నేతలే..
- నిద్రాపై తొమ్మిది నెలల క్రితం పీసీసీ చీఫ్ ప్రకటన
- మున్సిపల్ ఎన్నికల అనంతరం అమలుకు సర్కారు యోచన

నిజామాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో చెరువులు, నాలాల పక్కన ఉన్న అక్రమ కూల్చివేతల కోసం ప్రభుత్వం హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెస్ట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఏర్పాటు చేసింది. అదే తరహాలో నిజామాబాద్‌లోనూ నిద్రా సాక్షాత్కారం కానున్నది. ఈ విషయాన్ని తొమ్మిది నెలల క్రితం పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థకు అనుబంధంగా నిద్రా ఏర్పాటు కానున్నట్లు సమాచారం. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో భాగంగానే వరదల సమయంలో సహాయక చర్యలు చేపట్టడంతో పాటు వాగులు, చెరువుల కబ్జాలను తొలగించేందుకు నిద్రాను వినియోగించుకోనున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలోనే నిద్రాపై ద్వంద్వ ప్రకటనలు వినిపిస్తున్నాయి. కొంతమంది నిద్రా ఏర్పాటు చేయాలని కోరుతుండగా మరికొంతమంది నిద్రాతో పార్టీకి నష్టం జరుగుతుందనే వాదనను వినిపిస్తున్నట్లు సమాచారం. పీసీసీ చీఫ్ చేసిన ప్రకటన నేపథ్యంలో తప్పనిసరిగా నిద్రా ఏర్పాటు జరుగుతుందని భావిస్తున్నారు. ఆక్రమణదారుల్లో ఎక్కువ మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన లీడర్లే ఉన్నారు. పులాంగ్ వాగును కబ్జా చేసి కట్టిన బడా బిల్డింగ్‌లు, అపార్ట్‌మెంట్‌లు ఆ పార్టీకి చెందిన వారివే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో నిద్రా ఆవిర్భవిస్తే తప్పు చేసిన వారికి శిక్ష పడుతుందా? సామాన్యులపైనే ప్రతాపం చూపిస్తుందా? అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

## మున్సిపల్ ఎన్నికల అనంతరమే..

నగరపాలక సంస్థ పాలకవర్గం పదవీకాలం ఈ ఏడాది జనవరితో ముగిసింది. ఆరు నెలలుగా స్పెషల్ ఆఫీసర్ పాలన కొనసాగుతున్నది. పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ నిద్రా ప్రకటన చేసి తొమ్మిది నెలలు గడుస్తున్నది. కాగా.. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిద్రా విషయాన్ని ఎత్తడం లేదు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సమయాత్తం అవుతున్నది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలతోపాటు మున్సిపాలిటీ ఎన్నికలు సైతం జరగనున్నాయి. గ్రామాల్లో ప్రభుత్వానికి తీవ్రమైన వ్యతిరేక ఏర్పడింది. ఏ ఒక్క వర్గం ప్రజలు కూడా కాంగ్రెస్ పాలనపై సంతృప్తిగా లేరు. అందరూ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. పల్లెలతో పాటు పట్టణాల్లోనూ అదే పరిస్థితి ఉన్నది. కేసీఆర్ పాలనలో నగరవాసులకు తాగునీటి ఎద్దడి లేదు. చెత్త సమస్య వెలుగు చూడలేదు. కానిప్పుడు ఘోరంగా ఇక్కట్లు తాండవిస్తున్నాయి. రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీపై కాంగ్రెస్ ఎక్కువగా నమ్మకం పెట్టుకున్నది. సన్నబియ్యం పంపిణీలోనూ లోపాలు వెలుగు చూడడంతో సామాన్య కుటుంబాల్లో అసంతృప్తి రాజుకుంటున్నది. ప్రస్తుత గడ్డు పరిస్థితిలో నిద్రాను తీసుకువచ్చి కూల్చివేతలు ప్రారంభిస్తే.. నగరవ్యాప్తంగా వ్యతిరేకతను మూట గట్టుకుని ఎన్నికల్లో బోల్తా పడతామనే భావనలో కాంగ్రెస్ పార్టీ ఉన్నట్లు తెలుస్తున్నది. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన అనంతరం నిద్రాను తీసుకువచ్చి, పూలాంగ్ వాగు వెంట మొదట కూల్చివేతలు షురూ చేయనున్నట్లు తెలుస్తున్నది.

## ఇష్టారాజ్యంగా నిర్మాణాలు..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పలువురు అక్రమ కట్టడాలపై నీతులు చెబుతున్నారు. కానీ మరోవైపు ఇష్టారాజ్యంగా నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారు. నిజామాబాద్ నగరంలో ప్రస్తుతం తాజాగా నిర్మిస్తున్న కట్టడాలను పరిశీలిస్తే ఈ విషయం అవగతం అవుతున్నది. నగరంలోని అనేక డివిజన్లలో అనుమతి పత్రం ఒకటి ఉంటే నిర్మాణం మరోలా ఉంటున్నది. బల్దియా సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ.. తనిఖీలు చేపట్టాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. నిర్మాణాదారులతో కుమ్మక్కై ఇష్టారీతిన నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. సామాన్యుడు ఇంచు మందం ఉల్లంఘిస్తే ఇట్టే వాలిపోతున్నారు. వారిని భయపెట్టి నిబంధనలను బూచీగా చూపెట్టి దారికి తీసుకువస్తున్నారు. బడా బాబులకు ఈ నిబంధనలు వర్తించడం లేదు. ఎందుకు అని ప్రశ్నించే వారు లేరు. ఆక్రమణల తొలగింపు ఎంత ముఖ్యమో.. అక్రమ నిర్మాణాలను నిలువరించడం అంతే ముఖ్యమనే సంగతిని పాలకులు విస్మరిస్తున్నారు. ఏడాదిలో బడా బిల్డింగ్‌లను కట్టేసి వినియోగదారులకు అంటగట్టి బిల్డర్లు తప్పించుకుని తిరుగుతున్నారు. పులాంగ్ వాగు చుట్టూ ఇప్పుడంతా ఇదే జరుగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ వ్యవహారం అంతా బాహాటంగానే జరుగుతున్నప్పటికీ యంత్రాంగం మాత్రం కండ్లు మూసుకున్నది. నిజామాబాద్ నగరంలో సుమారుగా 10 నుంచి 15 కిలోమీటర్ల మేర విస్తరించిన పులాంగ్ వాగు వెంట పదుల సంఖ్యలో అపార్ట్‌మెంట్లు, వందల సంఖ్యలో నివాసాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇందులో దశాబ్దాల క్రితం కట్టినవి ఉండగా.. తాజాగా నిర్మించుకున్నవి, ప్రస్తుతం నిర్మిస్తున్నవి కూడా ఉన్నాయి.

# అటవీ భూమి కబ్జాకు యత్నం

### అడ్డుకున్న ఫారెస్ట్ సిబ్బందిపై కారంతో దాడి

ఇందల్వాయి/ ధర్పల్లి, జూన్ 21: అటవీ భూమిని కబ్జాకు పాల్పడుతున్న వారిని అడ్డుకునే ప్రయత్నం చేసిన అటవీ అధికారులు, సిబ్బందిపై కారం పొడి చల్లి దాడి చేసిన ఘటన అటవీ రేంజ్ పరిధిలోని ధర్పల్లి మండలం కోటాన్‌పల్లి సెక్షన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇందల్వాయి రేంజ్ అధికారి రవిమోహన్ భట్, ధర్పల్లి సీఐ భిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఇందల్వాయి రేంజ్‌లోని రామారెడ్డి రిజర్వు అటవీ ప్రాంతంలోని అపార్ట్‌మెంట్ నంబర్ 593లో అటవీ భూమిని చదును చేస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు అటవీ సిబ్బంది, సెక్షన్ అధికారులు శుక్రవారం రాత్రి దాడిచేశారు. అక్కడ భూమి చదును చేస్తున్న టీఎస్16యూసీ7054 నంబర్ ఉన్న ట్రాక్టర్‌ను పట్టుకొని అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన భూక్యా నవీన్, బాదావత్ పూల్‌సింగ్, సక్యా, మధు అడ్డుకొని, వారితో తెచ్చుకున్న కారంపొడి అaధికారులు, సిబ్బందిపై చల్లారు. ఈ విషయమై ఎఫ్‌ఆర్‌వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అటవీ భూమి కబ్జాకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

# ఎల్లారెడ్డి ఎఫ్‌ఆర్‌వో సస్పెన్షన్


### అటవీ భూముల రక్షణలో నిర్లక్ష్యం వహించినందుకు..

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 21: ఎల్లారెడ్డి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్‌ఆర్‌వో) ఓంకార్ నాయక్ సస్పెన్షన్‌కు గురయ్యారు. విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ గ్రామ అటవీశాఖ భూమిలో నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి ఆయన అనుమతి ఇచ్చినట్లు, ఎల్లారెడ్డి పరిధిలోని పలు అటవీభూముల కబ్జాకు ఆయన పాల్పడినట్లు సమాచారం. ఎల్లారెడ్డి శివారులోని అటవీశాఖ అర్బన్‌పార్కు పనులు చురుగ్గా సాగడం లేదని, అంతేకాకుండా లక్ష్మాపూర్ రోడ్డు పక్కన ఉన్న ఇటుకబట్టీలకు అక్రమంగా అనుమతులు ఇచ్చినట్లు తెలిసింది. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ.. అటవీ భూముల రక్షణను పట్టించుకోకపోవడంతో ఆయనను సస్పెండ్ చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

**ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌వోగా చరణ్‌తేజ్..**

ఎల్లారెడ్డి ఎఫ్‌ఆర్‌వో ఓంకార్ నాయక్ సస్పెన్షన్‌కు గురికావడంతో ఆయన స్థానంలో చరణ్‌తేజ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. చరణ్‌తేజ్ కామారెడ్డి మొబైల్ పార్టీ ఎఫ్‌ఆర్‌వోగా పనిచేస్తున్నారు. ఈమేరకు ఆయన శనివారం బాధ్యతలను చేపట్టారు. అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

## గురుకుల పార్ట్‌టైం లెక్చరర్ అనుమానాస్పద మృతి



స్వప్న (ఫైల్)

బాన్సువాడ రూరల్, జూన్ 21: కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాల/కళాశాలలో కెమిస్ట్రీ పార్ట్ టైం లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న మామిడి స్వప్న (33) శనివారం అనుమానస్పదస్థితిలో మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని గాండ్లపేట్ గ్రామానికి చెందిన స్వప్న హన్మాజీపేట్ గిరిజన బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో పార్ట్ టైం లెక్చరర్‌గా సంవత్సర కాలంగా విధులు నిర్వహిస్తున్నది. శుక్రవారం కాలేజీలో డే, నైట్ డ్యూటీ చేసి విద్యార్థులతో కలి సి గురుకులంలోనే పడుకున్నది. శనివారం ఉదయం విద్యార్థులు నిద్ర లేచి ఆమెను లేపేందుకు ప్రయత్నించగా.. ఎలాంటి స్పందనా లేకపోవడంతో ప్రిన్సిపాల్ శ్యామలాదేవి దృష్టికి తీసుకెళ్లారు. స్వప్నను చికిత్స కోసం బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతి విషయమై ప్రిన్సిపాల్.. కుటుంబ సభ్యులకు సమాచారం అదించారు. తమ కూతురు మృతిపై అనుమానం ఉన్నదని తల్లి రుక్మాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని నస్రుల్లాబాద్ ఎస్సై లావణ్య తెలిపారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న టీయూసీఐ ప్రతినిధులు




## 'కార్పొరేట్ కంపెనీలకు ఏజెంట్‌గా మోదీ సర్కారు'

ఖలీల్‌వాడి, జూన్ 21: మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఏజెంట్‌గా పని చేస్తున్నదని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జాతీయ అధ్యక్షుడు అమ్రిశ్ పటేల్ విమర్శించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న టీయూసీఐ రాష్ట్ర మహాసభల సందర్భంగా శనివారం వేలాది మంది కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో అమ్రిశ్ పటేల్ మాట్లాడుతూ.. కేంద్రంపై విమర్శలు గుప్పించారు. మోదీ ప్రభుత్వ విధానాలన్ని అంబానీ, ఆదానీ, టాటా వంటి కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసేలా ఉన్నాయని ఆరోపించారు. విమనాలు, విమానాశ్రయాలు, నౌకలు, నౌకాశ్రయాలు ఇలా అన్నింటినీ ప్రైవేట్ కంపెనీల చేతుల్లో పెడుతున్నారని, ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించి నిరుద్యోగం పెంచుతున్నారన్నారు.

# 'భరోసా' అందని రైతుల వివరాల సేకరణ



రైతుల నుంచి వివరాలు తీసుకుంటున్న ఏవో రమ్యశ్రీ

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మోర్తాడ్, జూన్ 21: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని 386 సర్వేనంబర్‌లో సుమారు 40మంది రైతులు పంటలు సాగుచేసుకుంటున్నారు. వారికి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు క్రమం తప్పకుండా వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతు భరోసా డబ్బులు రావడం లేదు. ఈ విషయమై అధికారులను అడిగితే రైతులు సాగుచేసుకుంటున్న సర్వే నంబర్‌ను లాక్ చేశారని సమాధానం ఇచ్చారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. ఈ విషయమై నమస్తే తెలంగాణ మెయిన్ ఎడిషన్‌లో సర్వే నంబర్ లాక్.. 'భరోసా' బ్లాక్ అనే కథనాన్ని శనివారం ప్రచురించింది. దీనికి ఉన్నతాధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 386 సర్వేనంబర్‌లో భూమి సాగుచేసుకుంటున్న రైతుల వివరాలను ఏవో రమ్యశ్రీ సేకరించారు.

# యూరియా పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన అధికారులు




యూరియా పంపిణీ కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

రామారెడ్డి (సదాశివనగర్), జూన్ 21: యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి జిల్లా పద్మాజీవాడి సొసైటీలో యూరియా కోసం రైతులు చెప్పులు క్యూలో పెట్టారు. ఈ విషయాన్ని నమస్తే తెలంగాణ మెయిన్ ఎడిషన్‌లో 'యూరియా కోసం క్యూలో చెప్పులు' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించారు. పద్మాజీవాడి సొసైటీని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ శనివారం సందర్శించారు. మండల వ్యవసాయాధికారి ప్రజాపతితోపాటు రైతులతో మాట్లాడారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచుతామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 895.5 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు చెప్పారు. జిల్లాకు మరో పదివేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు.